క్లుప్తంగా

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం


కె.జానకిరఘు


డి. వెంకటేశ్వర్లు

పుల్లలచెరువు: పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ ఆర్గనైజేషనల్ సెక్రటరీగా నియమితులైన కోర్తకుంట జానకిరఘు, సెక్రటరీ యాక్టివిటీగా నియమితులైన దోమకాలు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తమకు పదవులు రావడానికి కారణమైన పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పలు గ్రామాలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు వారిని కలిసి ప్రత్యేక అభినందనలు తెలియచేశారు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగింపు

దొనకొండ: మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు ఈ నెల 12వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఎంపీడీఓ ఎం శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వైభవంగా నరసింహస్వామి తిరునాళ్ల


తోకపల్లిలో నరసింహస్వామికి హారతి ఇస్తున్న అర్చకులు


ఆలయ ప్రాంగణంలో నామయ్యపుట్ట

పెద్దారవీడు: మండలంలో తోకపల్లెలో సద్గురు యోగానంద నరసింహస్వామి, 69వ పుట్ట తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామిరికి తీర్థపు బిందెతో పంచామృతాభిషేకం, మంత్ర పుష్ప నీరాజనం, తదితర పూజలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు పుట్టకు పసుపు, కుంకుమ, పాలు, పండ్లు, పూలమాలతో పూజలు చేశారు. ట్రాక్టర్‌పై స్వామి చిత్రపటం పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి దీక్షా స్వాములతో పాటు భక్తులు భక్తి పాటలు పాడుకుంటూ వీధుల్లో ఊరేగింపుగా ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. దీక్షా స్వాములు నరసింహ స్వామి హోమం అనంతరం దీక్ష విరమణ చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతల సాయంతో భక్తులకు మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.


గోవిందును పరామర్శిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

బూచేపల్లి పరామర్శ

ముండ్లమూరు(దర్శి): మండలంలోని మారెళ్లలో గుండెపోటుతో చనిపోయిన పార్టీ కార్యకర్త చొప్పరపు కోటేశ్వరరావు చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నివాళులర్పించారు. అదే విధంగా ఉమామహేశ్వర అగ్రహారం, తమ్మలూరులో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్తలు చొప్పరపు గోవిందు, మీనిగ వెంకటేశ్వర్లులను పరామర్శించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో శనివారం జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు త్వరలో జరగనున్న పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు శ్రీనునాయక్, ఎస్టీ సంఘం నాయకులు గాలేనాయక్, ఆర్వోయఫ్ఆర్ కమిటీ సభ్యులు మంతన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల నివారణ దినోత్సవం

దొనకొండ:

నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 10న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1-5లోపు అంగన్‌వాడీ కేంద్రాల్లో, 6–19 సంవత్సరాల్లోపు బాల బాలికలకు పాఠశాలలు, కళాశాలల్లో నులి పురుగు నివారణ మాత్రలు అందజేయనున్నట్లు వైద్యాధికారి యం.సునీత తెలిపారు. బడి బయట పిల్లలను గుర్తించి ఆశా కార్యకర్తలతో ఈ మాత్రలు అందజేస్తామని సునీత పేర్కొన్నారు.

లోకో యాప్‌పై అవగాహన



యాప్ పై అవగాహన కల్పిస్తున్న నరసింహారావు

తాళ్లూరు: మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం లోకో యాప్‌పై వీఓఏలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐడీపీఎంఎస్ జిల్లా అధికారి సీహెచ్ నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలకు సంబంధించి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో శ్రద్ధ వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా పొందే రుణాలకు సంబంధించి తప్పులను సవరించేందుకు లోకో యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు సుజాత మదీనా, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, డీఎంజీ మోహన్‌రావు, ఏపీఎం దేవరాజు హనుమంతరావు, సీసీలు వీఓఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ

కురిచేడు(దొనకొండ): వార్షిక తనిఖీలో భాగంగా కురిచేడు పోలీస్‌స్టేషన్‌ను దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. నేరాల నియంత్రణ కేసులు చేధించడంలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర వహిస్తాయన్నారు. సిబ్బంది దొంగతనాలు, ఇతర నేరాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీస్ స్టేషన్ సిబ్బంది విజిబుల్ పోలీసింగ్‌లో పాల్గొనాలన్నారు. వాహన తనిఖీలు, రాత్రివేళ గస్తీ ముమ్మరంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

50 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కిషోర్

తాళ్లూరు: మండలంలోని వెలుగువారిపాలెంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 50 మందికి వైద్యులు పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ సమస్యలు ఉన్న వారిని పరీక్షించి, వారికి సలహాలు సూచనలు అందజేశామని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి తామే స్వయంగా తీసుకువెళ్లి ఆపరేషన్ చేయించి తిరిగి గ్రామాలకు క్షేమంగా చేరుస్తామని పేర్కొన్నారు. శిబిరంలో 15 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి సోమవారికి వారికి మార్కాపురంలో చికిత్స చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ అనిల్, ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, దేవయ్య, వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం ప్రమాదం


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎస్సై నాగరాజు

ముండ్లమూరు(దర్శి): ప్రయాణికులు ఆటోల్లో పరిమితికి మించి ఎక్కవద్దని ఎస్సై నాగరాజు సూచించారు. మండలంలో వాహనాలను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై నాగరాజు మాట్లాడుతూ గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులు ప్రయాణం సాగించడం ప్రమాదమన్నారు. ఏమైనా ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలు అధికంగా గూడ్స్ వాహనాల్లో వెళ్తున్నారని, అది చట్ట విరుద్ధమని అవగాహన కల్పించారు.